# వెంటాడే జ్ఞాపకం

**- జీవన్**

ఏ మూడు నెలలకో ఆరు నెలలకో ఓసారి హైదరాబాదు వెళ్ళడం, హృదయం నిండా మధురానుభూతులు నింపుకొని మళ్ళీ తిరిగి రావడం అలవాటైంది. చంటిదాని మొదటి పుట్టినరోజు తర్వాత, మూడు నెలలకు- ఇదిగో యిదే వెళ్ళి రావడం.



బుంగమూతీ, సొట్టలు పడే బుగ్గలూ, కెంపుల్లాంటి పెదాలూ, గిరజాల జుట్టూ- చిట్టి తల్లి రూపమే కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది అనుక్షణం. పాలబుగ్గల లేలేత మొగ్గలాంటి చక్కనమ్మ భుజాల్లమీద వాలీవాలగానే పూల జడివాన నను ముంచెత్తినట్టనిపిస్తుంది. ఒళ్ళంతా పులకరిస్తుంది. నరనరాన ఏదో నూతనోత్తేజం పుట్టుకొస్తుంది. చీకూ చింతా కల్లాకపటం లేని ప్రపంచంలోకి అడుగిడినట్టనిపిస్తుంది. చిట్టి చిట్టి చేతులు అటుఇటూ వింతగా ఆడిస్తూ ఏవేవో తన భాషలో చెబుతూనే వుంటుంది విరామం లేకుండా. అది ఎల్లలు లేని భాష, మూఢమతులమైన మనకు అర్థంకాని భాష, ఊఁగొడుతూ పోవాలి గానీ అనర్గళంగా ఎన్ని గంటలైనా ఉపన్యసించగలదు. దాని కోల మొహంలోని విశాలమైన కనుదోయిలో ఎన్నెన్ని తారాతోరణాలు!

‘నడకొచ్చింది, తాతా! తాతా! అంటూ కలవరిస్తున్నది’ అంటూ మూడ్న నెలలుగా మావాడు పోరుతూనే వున్నాడు. ఫోన్లో దాని తీయని గొంతు వినిపించి నను మంత్రముగ్ధుణ్ణి చేస్తూనే వున్నాడు. హైదరాబాద్ మాకు 200 కిలోమీటర్లే- అయినా ఏదో ఖండాంతరమైనట్టనిపిస్తుంది. ఇవాళ, రేపు అనుకుంటూనే మూడునెలలకు గానీ తెమలలేక పోయా- అనారోగ్యమూ అనవసరమైన అనేకానేక పనులతో!


ఏంచేస్తాం రెక్కలుడిగిన ఒంటరి పక్షులం. బీపీ, షుగరూ నిన్ను వదిలేది లేదు అని పట్టిపీడిస్తూనే వున్నాయి నన్ను. ఆమెకేమో కీళ్ళనొప్పులు. ‘ఏముందక్కడ- ఇక్కడే వుండి పోవచ్చుగా’ అంటాడు వాడు. తరతరాల పాదముద్రలు ఇక్కడున్నయ్‌రా అంటే అర్థమవుతుందా వాడికి చాదస్తపు మేళాలు అని వెక్కిరించడం తప్ప! దుమ్మూ ధూళీ పొగలు నిండిన వీధులూ అగ్గిపెట్టెలమీద అగ్గిపెట్టెలు పేర్చినట్టుండే అపార్టుమెంట్లూ, అన్నీ కొనుక్కోగలిగినా స్వచ్ఛమైన గాలిని కనుక్కోలేని దీనమైన బతుకులూ ఒకదానితో మరోటి సంబంధం లేని దీవుల్లాంటి జీవితాలూ- ఇంతకు మించి ఏమున్నాయక్కడ? అన్ని గదుల్లోనూ ఏసీ, టీవీలూ సోఫాసెట్లూ ఫోన్లూ బయటికెళ్ళాలంటే కారూ- ఇంకేం కావాలి అంటాడు - వస్తువులే అన్ని సుఖాలు సమకూర్చి పెడతాయన్నట్టు. మనసు విప్పి మాట్లాడే మనిషి లేని లోకం అదేం లోకం! జైలు ఒంటరి సెల్లు లోకమవుతుందా?

ఇద్దరం కలిసే వెళ్ళొద్దామన్నాను. ఇంట్లో దీపంపెట్టే మనిషంటూ వుండొద్దా అంటుంది సుహాసిని. స్విచ్చి వేయగానే వెల్తుర్లు పరచుకునే రోజులే అయినా మన మాట మారుతుందా, మన ఆచారం మారుతుందా? ఇంటిముందు పూల మొక్కలూ చిన్న చిన్న కూరగాయల మళ్ళూ- అవి ఎండిపోవా అంటుంది. పనిమనిషికో పక్కవాళ్ళకో చెప్పి పోదాం. నాలుగు రోజులే గదా అంటే మనం చూసుకుంటున్నట్టు చూసుకుంటారా వాళ్ళు అంటుంది. వ్యాపకం కాదు, అదో అనుబంధం!

మరి పిల్లల పట్ల అనుబంధం లేదా- అంటే అదేం కాదు. వంశాంకురాల మీద వల్లమాలిన ప్రేమ. కొద్దిరోజులకయినా సరే ఇద్దరం వాళ్ళకు భారమేనంటుంది. కనిపించకుండా వినిపించకుండా తన విసుగునీ అసంతృప్తినీ కోడలు ప్రకటిస్తుందట. నేనంత లోతుగా పరిశీలించలేకపోయాను గానీ ఆమె అనేక రుజువులు చూపిస్తుంది. ఇవాళ కాకపోయినా మరికొన్నాళ్ళ తర్వాతయినా అక్కడేగా వుండాల్సిన వాళ్ళం అంటే పెదవి విరిచి ‘ఎన్ని ఆశలు నీకు’ అంటుంది. పరిహాసం కాదు, అదో నిరాశ! ఇట్లానే రోజులు దొర్లించక తప్పదు అని గుర్తు చేస్తూనే వుంటుంది- రాబోయే పరిణామాలన్నింటికీ సిద్ధం కావాలన్నట్టు.

అబ్బాయితో ఒకసారి అని చూసిందట- మేమిక్కడుండడం అమ్మాయికి ఇష్టం లేనట్టుందిరా అని. అదంతా నీ ఊహ, పెద్దదానివి ఆ మాత్రం సరిపెట్టుకోలేవా అని తల్లినే మందలించాట్ట. ఏమీ తోచక ఓరోజు కాసేపు పక్కింటికెళ్ళొస్తే అమ్మాయి రుసరుసలాడిందట. వాడి ఫ్రెండ్సెవరో వస్తే టీ తాగే అయిదారు నిమిషాల సమయంలో వాళ్ళ యోగక్షేమాలు విచారించి లోకరీతిని గురించి కాసేపు ముచ్చటించానంటే- వాళ్ళెళ్ళింతర్వాత ‘ఇదంతా కార్పొరేటు ప్రపంచం నాన్నా, నీ చాదస్తంతో వాళ్ళను విసిగించావు’అని నన్ను విసుక్కున్నాడు మావాడు. కార్పొరేటు ప్రపంచమంటే మానవ ప్రపంచం కాదేమో, మానవ సంబంధాలుండవేమో!

ఒళ్ళంతా నూనె పట్టించి, మంచిగంధం నలుగుపెట్టి తలంటి స్నానం పోస్తే పూరేకుల్లా పిల్లలు మెరిసిపోతారంటుంది మా ఆవిడ. తల్లేమో (అంటే మా కోడలు) బేబీ లోషన్‌లూ బేబీక్రీములూ తప్ప మరోటి వాడే వీల్లేదంటుంది. చక్కనమ్మ, చక్కనయ్య అనో చిట్టీ బుజ్జీ అనో తీయగా పిల్చుకోకుండా పప్పీ బప్పీ అనే పిలుపులేమిటని విస్తుపోతుంది మా ఆవిడ. మన పాటలో పద్యాలో కథలో చెబుదామంటే విసుక్కుంటుంది తల్లి.



కంప్యూటర్ గేమ్సూ, రైమ్సూ, హ్యారీపోర్టర్లతోనే పిల్లల్ని పెంచాలంటుంది. మనసు నొచ్చుకున్నా ఏమీ అనలేని నిస్సహాయతతో సంచి సర్ది బయల్దేరుదాం పద అంటుంది మా ఆవిడ.

పిల్లలమీద ప్రాణం ఎంత కొట్టుకుంటున్నా నిగ్రహించుకొని నన్నొక్కణ్ణే వెళ్ళి రమ్మంది ఈసారి... చక్కనమ్మకు ఇప్పుడిప్పుడే నడకొస్తున్నది. తప్పటడుగులూ, వచ్చీరాని తియతీయని మాటలతో తన చుట్టే తిప్పుకుంది నన్నీ నాలుగైదు రోజులు. దాన్ని వదిలి బయల్దేరుతుంటే శూన్యమేదో ఆవహించినట్టనిపిస్తున్నది.

రైలు బయల్దేరి గంటన్నర దాటింది. బహుశా ఒకట్రెండు స్టేషన్లు దాటి వుంటుంది. ఎక్కడెక్కిందో ఎదురు సీట్లో- ఇద్దరు పిల్లల తల్లి. కిటికీ నానుకొని కూర్చొని పిల్లకు పాలిస్తున్నది కొంగు కప్పి. పక్కన ఎడం పిల్లడు- మూడేండ్లుంటయేమో. అన్నివైపులా పరిశీలనగా చూస్తున్నాడు చక్రాల్లాంటి కండ్లు తిప్పుతూ. తల్లి వలెనే మురికి శరీరం, మురికి బట్టలు. పాత బట్టల మూటని ఆనుకొని కూర్చున్నాడు. వాళ్ళ పక్కనే వృద్ధ దంపతులు. రైతు కుటుంబం నించి వచ్చినట్టు చెప్పకనే చెబుతున్నారు వేష భాషల్తో. నా పక్కన ఆధునిక యువ దంపతులు వాళ్ళ అబ్బాయితో కలిసి కూర్చున్నారు. అప్పటిదాకా చెవిలో యంత్రమేదో పెట్టుకొని సంగీతం ఆస్వాదిస్తున్న వాడల్లా సెల్‌ఫోను మోతకు ఉలిక్కిపడి ‘హలో సర్, ఎస్సర్, ఓకే సర్, నోప్రాబ్లమ్ సర్’ అంటూ పడిగట్టు పదాలతో ముగించి ల్యాప్‌టాప్ సిద్ధంచేసుకొని ఏవేవో అంకెలూ రిపోర్టుల్లో మునిగిపోయాడు.

“డైనింగ్ టేబుల్ మీదికేననుకున్నా, రైలుబోగీలోకీ

వచ్చి కూర్చుంది నీ ఆఫీసు" అంది ఆ యువతి.

అది పరిహాసమో అసంతృప్తో అర్థంకాలేదు నాకు.

"బాత్‌రూంలోకి కూడా! మర్చిపొయ్యావ్" మందహాసంతో బదులిచ్చాడు యువకుడు పనిలో లీనమయ్యే.

"య్‌యా! బెడ్‌రూంలోకి కూడా!" తను వేసిన జోకుకు తానే నవ్వుకుంటూ అంది.

నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు నాకు.

ఉదయం తొమ్మిది దాటింది. అంటే మాత్రలేసుకొనే సమయం. టిఫిన్లో నాలుగు ఇడ్లీలూ, కారప్పొడీ, పల్లీ చట్నీ వేసిచ్చింది కోడలు నే బయల్దేరే ముందు. అవి తింటేనే గానీ మాత్రలు వేసుకోకూడదు. మెత్తటి ఇడ్లీ రుచికరమైన పొడీ చట్నీలతో కలిపి గబగబా మూడు తినేసి నీళ్ళు తాగుతూ ముందుకు చూశా. మూడేండ్ల పసివాడు గుటకలు మింగుతూ నావేపే చూస్తున్నాడు. వాడి కండ్లల్లో ఎన్నేళ్ళనాటి ఆకలి బ్ఢాధో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది. మిగిలిన ఇడ్లీ ఇద్దామంటే ఎంగిలిది ఇవ్వ బుద్ధికాలేదు. వాడి వంకే చూస్తున్నా. వాడూ నా వంకే చూస్తున్నాడు. అవే ఆకలి చూపులు! నన్ను అవి అవమానించినట్లనిపించాయ్. వాడి నోటి ముందటి తిండిని కొల్లగొట్టి తిన్న అపరాధిలా నాకు నేనే కనిపించా. కడుపులో దేవినట్టనిపించింది. చేతులు కడుక్కొని టిఫిన్ బాక్స్ సంచిలో పడేసి మాత్రలయినా వేసుకోకుండానే వెనక్కి వాలిపోయా.

ఖాజీపేట జంక్షన్లో బండి అయిదు నిమిషాలాగింది. చాయ్‌లూ టిఫిన్లూ అమ్మేవాళ్ళ, కొనుక్కొనే వాళ్ళ అరుపులూ కేకలతో కోలాహలంగా మారింది. ఎక్కే వాళ్ళ, దిగే వాళ్ళ తోపులాటలతో సందడిగా మారింది. మళ్ళీ బయల్దేరింది బండి. వరంగల్లు దాటగానే వేగం పుంజుకుంది.

కిటికీలోంచి బయటకు వస్తున్న రైతుమహిళ "పత్తి శేండ్లూ మిరప శేండ్లూ ఎట్లెండిపోతున్నయో సూడు" అంది భర్తతో.

"మడుసులు నీతి తప్పినంక కార్తెలు రీతి తప్పయా"అన్నాడు వృద్ధ రైతు.

"పాడు రోగాలు! ఎన్ని మందుల్గొట్టినా తగ్గవాయె!" నిట్టూరుస్తూ అంది.

"ఎన్కటికిన్ని పురుగులుండెనా, ఇన్ని రోగాలుండెనా? పురుగును పెంచెటందుకే వచ్చినట్టున్నయిన్నిన్ని మందులు. కల్తి యాపారుల రాజ్జెం, దలారి రాజ్జెం. ఏడు నిలువుల లోతున బొంద బెడ్తాన్రి రైతును!" ఆగ్రహం కలగలిపిన అసంతృప్తి అతనిది.

"బిస్కెట్లూ! చాక్లెట్లూ! కేకులూ!"అంటూ కేకేస్తూ వచ్చాడో పధ్నాలుగేళ్ళ పిల్లడు ట్రేలో వాటిని పొందిగ్గా సేర్చుకొని. నాపక్క యువ దంపతులు క్రిస్పీ బిస్కట్లూ ఫైవ్‌స్టార్ చాక్లెట్లూ కొన్నారు. ఆ యువతి తన గారాల తనయుడి ఖరీదైన బట్టలమీద మరక పడకుండా జాగ్రత్తగా చాక్లెట్లు తినిపిస్తున్నది. ఎదురు సీట్లోని మూడేళ్ళ బాలుడు బిస్కట్లు కొనిపెట్టమని తల్లిని బతిమిలాడుతున్నాడు మెల్లగా. వాడిని తన వైపు లాక్కొని మిగిలిన ఎవ్వరికీ వినిపించనంత మంద్ర స్థాయిలో వాడి చెవిలో ఏదో చెప్పింది. క్రమశిక్షణకు మారుపేరైన సైనికుడిలా ఒళ్ళో చేతులు పెట్టుకొని నేలచూపులు చూస్తూ కూర్చుండిపోయాడు వాడు.

మరో స్టేషన్లో బండి ఆగింది. "ఈడనేనా దిగేది" అని ప్రశ్నిస్తున్నాడు పిల్లవాడు. "ఈడకాదు! కుసేపట్ల వస్తది. గిన్నన్ని నీల్లుతాగు" అంటూ వాడికి సగం ఖాళీఅయిన సీసా అందించింది. రెండు గుటకలు మింగి సీసా మూత బిగించి తల్లికి అందించాడు.

చంటి పిల్లకు పాలు సరిపోయినట్టు లేదు- పీలగా ఏడుస్తున్నది. దాన్ని భుజాలమీద వేసుకొని జోగొడుతూ నిద్రపుచ్చి ఒళ్లో పడుకోబెట్టుకొని కిటికీలోంచి బయటకు చూస్తున్నది.

* * *

రైలు ముందుకు పోతుంటే చెట్లూచేమా ఇండ్లూ వెనక్కి పోతున్నయ్. కాలం ముందుకు సాగుతుంటే బతుకు వెనక్కు పోతున్నదనిపించింది ఆ ఇద్దరు పసిపిల్లల తల్లికి. కాలచక్రం గతితప్పిందనిపించింది పాతికేండ్లయినా నిండని ఆ పడతికి. సంసారమనే బండిని మొగుడూ పెండ్లాం అనే జోడెడ్లు లాగినా సాగుడు కష్టమాయె. అసుంటిది ఒకెద్దు తప్పుకుంటే ఒంటరెద్దు లాగుతదా, దానికది చాతనయితదా అని వితర్కించుకుంటున్నది.

"ఎన్కటికిన్ని పురుగులుండెనా, ఇన్ని రోగాలుండెనా? పురుగును పెంచెటందుకే వచ్చినట్టున్నయిన్నిన్ని మందులు. కల్తి యాపారుల రాజ్జెం, దలారి రాజ్జెం. ఏడు నిలువుల లోతున బొంద బెడ్తాన్రి రైతును!"

మొగుడు పాలేరుగిరికి తన కూలినాలి పనులు తోడయితెనె తిండికి బట్టకు లోటు లేకుంట బతుకు బండి సాగుతుండె. రెక్కలుడిగిన అత్తమామలు, రెక్కలింక మొలువని పసిపొలగాల్లు- కలో గంజో గతికి గుడిశెల ముడుసుకొంటుంటిమి. అర్ధమరేతిరి దనుక బోరు బాయి కాడ కాసుక్కూసోవాల్నాయె మొగుడు. కరంటెప్పుడిస్తె గప్పుడు మడి తడుపుకోవాల్నాయె. ఎండిన శెరువులు, సుక్క నీరు లేని కాలువలు! కరంటుతో ముడిబెట్టుకున్న బతుకులు!

కాలుకు సుట్టుకున్న కరంటు తీగె కాలనాగై ఊపిర్లుదీసె!

ఎండుతున్న పైరును బతికిచ్చుకునెతందుకు బతుకునె బలిచ్చుకునె పెనిమిటి...

ఇంకని కన్నీటి చెలిమని కొంగుతో వత్తుకుంటున్నది ఆ పడతి.

కరెంటు షాక్‌కు గురై తనువు చాలించిన భర్త కనుల ముందు నిలిచాడు. తెల్లారక ముందే పక్క పొలాల పాలేర్లు మోసుకొచ్చిన దుర్వార్త ఇప్పటికీ గుండెల్ను పిండేస్తూనే వుంది! ముందటి రేత్రి కడుపునిండ బువ్వదిని, పిల్లల్ను ముద్దుజేసి, తన మురిపెందీర్చి టార్చి లైటూ ములుగర్రతో బయలెల్లిన భర్త తెల్లారెటాల్కె పచ్చని గరికె మీన ఉలుకూ పలుకూ లేకుంట...

గుండె పలిగి ఎన్ని శోకాలు పెట్టిన గని తిరిగొస్తడా కాలనాగు కాటేసినంక...

ఈ ఆరు నెలలూ తాననుభవించిన క్లేశాల్ని నెమరేసుకొంటున్నది ఆ యువతి. 'నీ పొలం పన్నిల్నెగదా పానాలు తీసుకున్నడు, సాయం జెయ్యాలె'నంటూ కుల పెద్దలు రైతుదగ్గర మొరబెట్టుకొంటే 'సర్కారోని కరంటు సప్లయ్‌కి నేనేంజేత్త. నిద్దరమత్తుల ఏం ముట్టుకుండో"నంటు తప్పంతా సర్కారుదీ, లాలయ్యాదేనంటూ తేల్చి దహన ఖర్చులకు అయిదు వేలిచ్చి చేతుల్దులుపుకొనె పాతికెకరాల రైతు. "సర్కారోడేదో 'ఆపతి బందు' ఇస్తడంటె ఎంతమంది సుట్టు దిరిగిన, ఎంత మందిరి కాల్లు పట్టిన, ఎన్నెన్ని కాయితాలిచ్చిన"- పనులొదులుకొని తిండీ తిప్పలు మానేసి సర్కారు యంత్రాంగం చుట్టూ తిరిగిన వైనాన్ని గుర్తుతెచ్చుకున్నది.

యాష్టొచ్చి- ఇంక యియ్యరు, సావరు అని నిర్ణయించుకొన్నాక పొద్దు సొంతం కుంకే యాళ తాసిల్దారు బంట్రోతు "దొరది శాన దయగల గుండె. ఇప్పుడెవల్లు లేరు. నీ గోడినిపిచ్చుకొంటడు పొమ్మని" లోనికి బంపె. శెప్పిందంత ఎంతోపిగ్గ ఇన్నడు, ఎంత కనికారం జూపిస్తాండు అనుకొంటుండగనె శేయిపట్టి ఎదవబుద్ధి బయటబెట్టుకొనె! దిక్కులేనిది, కష్టాలల్ల వున్నది, కూటికెల్లనిది, కడగొట్టు కులంది- తనకు లొంగకపోతదా అని ఎంత అలుసు, ఎంత పొగురు వానికి! కాయ కష్టంతో కాయల్గాసిన శేతి దెబ్బ ఈ శెంపనూ, ఆ శెంపనూ వాయగొడ్తె కండ్లల్ల నీల్లుబెట్టుకుంట కాల్లమీన పడె కుక్క!

అది గుర్తొచ్చి నవ్వొచ్చింది పని పాటల పడతికి...

సన్నగా నవ్వుకుంటున్న ఆ అమ్మాయిని చూస్తే నా కూతురు లావణ్య గుర్తుకొచ్చింది. ఈ అమ్మాయి కూడా చదువుకొని, మంచి ఉద్యోగమూ, చీకూ చింతా లేని కుటుంబ వాతావరణంలో వుంటే లావణ్య వలెనే ప్రశాంతంగా ప్రసన్నంగా వుండేది గదా అనిపించింది నాకు.

ఒక్కసారి నావైపు చూసి తన లోకంలో తాను పడిపోయింది ఆ అమ్మాయి-

రఁయ్‌న బైటకొస్తంటె సంగతంత పసిగట్టిన బంట్రోతు "ఏదో సాయం జేద్దమని లోనికి దోల్తె లొల్లింత జేస్తవా" అంటండు తప్పంత నాదన్నట్ల. "నీ పెల్లాన్ని బంపి సాయంజేస్కో"- మొకం వాసేటట్ల శివాట్లుపెట్టి ఆగనన్న ఆగకుంట బైటబడ్తి.

ఒక్కపాలె బతుకిట్ల బండలైపాయెనే!

ఓడలు బండ్లయిత యంటె గిదేనేమొ!

పొయిల పిల్లిలేవాలెగా! నా ఒక్క కడుపయితె కడుపుల కాల్లు బెట్టుక ముడ్సుక పందు. పసి పొలగాల్లుండిరి, ముసలయ్యా ముసలమ్ముండిరి. సంటిదాన్ని ముసలమ్మకాడొదిలి పనికి బొయినా ఊళ్ళె పనులంతంత మాత్రమేనాయె. నాట్లప్పుడో కలుపులప్పుడో కోతలప్పుడోనేనాయె పనులు! గయ్యన్న కాలం కలిసొస్తెనే నాయె! లేని రోజున?

జనగాంల సుతారి పనికిబోతె దినం ఒందొస్తయనిరి దినాం కూలికి బొయ్యొచ్చెటోల్లు. ఆటోల బొయ్యి, ఆటోల రావొచ్చునాయె. బాగనె వుండె నాలుగొద్దులు. అటెన్క పన్నొర్కాల్నంటె మేస్త్రీరిల్జెప్పినట్టు ఇనాల్నంట. శెప్పినట్టు ఇనాల్నంటేంది - లేకి ముండ కొడుకులు! లేకి పనులు! అడ్డపని బందు......

* * *

ఆ అమ్మాయి మొహంలో ప్రత్యేకించి కండ్లల్లో ఏదో ప్రత్యేకత కన్పించింది నాకు. మాసిన నాసిరకం బట్టలే- చినుగులూ మాసికల్తో సహా! ఒంటిమీద ఏ విధమైన ఆభరణమూ లేదు. పరీక్షించి చూస్తే- మెళ్ళో పసుపుతాడైనా లేదు! ఓహ్, ఇంత పిన్నవయసులోనే ఎన్ని బాధలూ భారాలూ మోస్తున్నదో గదా!

ఇంత సేపట్నించి ఎదురెదురుగా కూర్చున్నా పలకరించుకోలేదు మేమిద్దరం. మొదట నేనే పలకరించా- 'ఎక్కడిదాకమ్మా' అంటూ.

'మదిర దనుకనే నాయిక గారూ' అంటూ ఎంతో నమ్రతగా సమాధానమిచ్చింది ఆ అమ్మాయి.

"ఆ ఊరా మీది?"- అట్లా ప్రశ్నించవచ్చునా లేదా అనైనా ఆలోచించకుండానే అడిగా.

(మిగతా27వపేజీలో)

**(19వ పేజీ తరువాయి)**

"ఆడ మా తమ్ముడుంటడు. మా ఊరు జనగాం దగ్గ రుంటది" నేనడగబోయే తరువాతి ప్రశ్నకు కూడా ముందే సమాధానమిచ్చింది.

అక్కడినుంచి ఇక్కడికెందుకు పోతున్నట్లు!

చుట్టపుచూపుకేనా, లేక...

అడగడం భావ్యంకాదని మిన్నకుండిపోయా.

నా పక్కన కూర్చున్న ఆధునిక యువతి తన గారాల తనయుడు వద్దని గోలపెడుతున్నా యాపిల్ ముక్కలూ, ద్రాక్ష పండ్లూ, బిస్కెట్లూ, కేకులూ వాడి నోట్లో కూరుతూనే వుంది. ఎదుటి సీట్లోని పిల్లవాడు ఆకలి చూపులు చూస్తూనే వున్నాడు.

బిస్కెట్లమ్మే పిల్లవాడు ముందు కేకతో, అటు తర్వాత ట్రేతో ప్రవేశించాడు. ఆకలవుతున్న వాళ్లు కొనుక్కొం టూనే వున్నారు. ఆకలి చూపుల పిల్లవాడు చూస్తూనే వున్నాడు.

పది రూపాయలిచ్చి ఓ బిస్కటు పాకెట్టు కొని పిల్ల వాడికి అందించబోయా. పిల్లవాడూ చేయిచాపబో యాడు. అమాంతం తల్లి చేయి అడ్డంపెట్టి "ఒద్దు నాయినగారూ, ఒద్దొద్దు"అంటూ కాస్త కటువుగా వారిం చింది. పిల్లవాడి వైపు అదో రకంగా చూసింది. వాడు బిస్కట్ పాకెటును ట్రేలో పడేసి చేతులు ఒళ్ళో పెట్టు కొని నేల చూపులు చూస్తూ కూర్చున్నాడు.

ఈ హఠాత్పరిణామానికి ఖిన్నుణ్ణయి మౌనంగా సీటు వెనక్కి వాలిపోయా. అయిదు నిమిషాల తరు వాత కాసిని మంచినీళ్ళు తాగా. అప్పటికి గానీ మనసు కొద్దిగా కుదుటపడలేదు.

ఏమిటి ఈ అమ్మాయి ప్రవర్తన- నేనేదో నేరం చేసి నట్టు? ఆకలిగొన్న పిల్లవాడికి ఓ బిస్కెటు పాకెట్టు కొని వ్వడం నేరమా? కనీసం- నా వయసుని సైతం గమనిం చకుండా అట్లా ప్రవర్తిస్తుందా?

నా అహమేదో గాయపడినట్టనిపించింది.

మరో అయిదు నిమిషాల తర్వాత ఆ అమ్మాయే అంది మెల్లగా: "మీకు కోపం తెప్పిచ్చిన్నా నాయిన గారూ! మీ ఓలిగె సదువుకున్నదాన్ని కాదు. ఎట్ల మాట్ల డాల్నో తెలువదు. తప్పుంటె మన్నించురి" అంటూ చేతులు జోడించింది.

అవాక్కయి పోవడం నావంతయింది. ఆవేశం అరి కాళ్ళలోకి జారుకుంది. ఎందుకట్లా ఆలోచించాను? ఒక్క బిస్కెటు పాకెట్టుతో వాడి ఆకలి కాసేపు తీర్చగల నేమో! అటు తర్వాత... మరొకడు తీరుస్తాడా? ఈ దాతృత్వాలతో వాడి ఆకలి పరిష్కారమౌతుందా? ఆ అమ్మాయి తిరస్కరిస్తే అహం దెబ్బతినడమేమిటి? ఎందుకింత అల్పంగా ఆలోచిస్తున్నాను.

ఎదురుగా కూర్చున్న ఆ అమ్మాయి నా మొహంలోని భావాల్ని చదువుతున్నదేమోననిపించింది. "లేదమ్మా నీమీద నాకేమాత్రం కోపం లేదు. తొందరపడి కొంత చనువు తీసుకున్నానంతే! కేవలం చదువులతోనే సంస్కారం అబ్బుతుందనుకోలేం"అన్నా ఆమెలోని సంస్కారాన్ని గుర్తించినట్టు తెలియజేస్తూ.

నా పక్కనున్న ఆధునిక దంపతులు మొహాలు చిట్లించుకుంటున్నారు.

"ఎన్ని కష్టాలొచ్చిన గని ఒకల్ల దగ్గర చెయ్యి సాచొ ద్దన్నరు మా అమ్మానాయిన్లు. శిన్ననాట్నుండి గట్నె పెంచిన్రు" తన ప్రవర్తనకు సంజాయిషీ ఇచ్చుకుంటున్న ట్టుగా అంది.

"మీ అమ్మానాన్నలు గొప్పవాళ్ళు. అదొక గొప్ప నీతి" మెచ్చుకోలుగా అన్నా.

"మీరు పంతులుగారా నాయినగారూ" అంది కన్నుల్లో కాంతుల్తో. నా మొహాన రాసిపెట్టినట్టు చది విందేనని నవ్వుకుంటూ "అవునమ్మా కాలేజీలో పిల్ల లకు పాఠాలు చెప్పి రిటైర్ అయ్యా- అంటే విశ్రాంతి తీసుకొంటున్నా" అన్నా.

"యాణ్ణుంచొస్తున్నరు?" ఇహ ప్రశ్నించడం తన వంతయినట్టు అడిగింది.

"హైదరాబాదులో అబ్బాయినీ, పిల్లల్నీ చూసొ స్తున్నా"

"మీ అబ్బాయిగారు గూడ పంతులుగారేనా?" పంతుళ్ళ పిల్లలు పంతుళ్ళే అవుతారనుకుందో ఏమో!

"లేదమ్మా, మావాడు డాక్టరు"

"మరి యాడికి బోతున్నరు"- మరో ప్రశ్న సంధిం చింది.

"ఖమ్మం- అక్కడే వుంటాం"

"అబ్బాయిగారి కాణ్ణే వుండొచ్చుగా- కడుపునొచ్చినా కాలునొచ్చినా డాట్టరు గారాయె..."అంటూ నాలిక కర చుకొని "ఏదో తెల్వక అన్నలే నాయినగారూ" అంది.

"ఏం పర్వాలేదమ్మా అయినా ఈరోజుల్లో ఎవరి బతుకులు వాళ్ళవే, ఎవరి బాధలు వాళ్ళవే"అన్నా వేదాంత ధోరణిలో.

ఈయనిక్కడెందుకు దాపురించాడురా- అనుకు న్నారో ఏమో నా పక్కనున్న ఆధునిక దంపతులు అస హనంగా చూస్తున్నారు నా వంక.

ఆ అమ్మాయితో కొంత చనువేర్పడింది గనుక మొదట అడగలేని ప్రశ్న ఇప్పుడు అడిగా- "తమ్ముణ్ణి చూడ్డానికి పోతున్నావా?" అని.

"కాదు నాయినగారూ! ఏదన్న పనెతుక్కుందం యని. పల్లెల్ను కరువు కాటేసె, వొర్తకం కాటేసె. వలస బత్కులైపాయె. పిల్లల్ను బతికిచ్చుకోవాల్నా, అత్తామా మలకింత గంజన్న పొయ్యాల్నా?" అంది.

"అత్తామామల్ను గూడ నువ్వే పోషించాల్నా?"

"ఉన్న ఒక్కగనొక్క కొడుకుపాయె. కోడల్ను నేనుం డంగ అనాదల్ని జేస్తనా వాల్లని ముసల్తనంల. కలో గంజో తలాఇంత పంచుకోవద్దా- ఏమంటరు?"

"నిజమేనమ్మా నువ్వన్నదే న్యాయం."

ఇంతలోనే దిగాల్సిన స్టేషనొచ్చింది.

"వస్తానమ్మా మా స్టేషనొచ్చింది. దిగుతున్నా" బ్యాగు చంకలో తగిలించుకుంటూ లేచా.

"నాయినగారూ, కుసిన్ని మంచినీల్లు పట్టి స్తరా"అంటూ ఖాళీసీసా అందించింది నాకు.

గబగబా దిగి సీసా నింపుకొని కిటికీలోంచి ఆ అమ్మాయికి అందించా.

"కష్టపెట్టిన మిమ్ముల"అంది సీసా అందుకుంటూ

"లేదమ్మా సంతోషంగా వుంది ఈ మాత్రం నీకు సాయం చేయగలిగినందుకు" అన్నా.

రైలు కూత పెట్టింది.

"జాగర్త నాయినగారూ, జాగర్తగ పోండి" అంది చేయూపుతూ.

"నువ్వూ నీ పిల్లలు నూరేండ్లు చల్లంగ వర్ధిల్లా లమ్మా" అన్నా ఆప్యాయంగా ఆ అమ్మాయి తలమీద చేయి వుంచి.

"అంతా మీ దీవెన నాయినగారూ"అంది అంతే అభిమానంతో.

బండి కదిలిపోయింది.

ఆ అమ్మాయి మహోన్నత రూపం నా మది నుండి ఇంతవరకు తొలగిపోలేదు.

★


రచయిత చిరునామా:
**జీవన్**
ప్రతిభా కుటీరం
ఇం.నెం.4-1-19
రోటరీ నగర్
ఖమ్మం- 507 002